ఈనాడు
రాజన్న సిరిసిల్ల
మంగళవారం అక్టోబరు 8, 2024

వ్యర్థాల శుద్ధిలో వెనకడుగు

ఎఫ్ఎస్‌టీపీల వినియోగంపై ప్రజల్లో కొరవడిన అవగాహన



'స్వచ్ఛభారత్ మిషన్‌తో దేశ శ్రేయోభివృద్ధికి సరికొత్త మార్గం ఏర్పడింది. 21వ శతాబ్దంలో విజయవంతమైన ప్రజా ఉద్యమం. పరిశుభ్రత వారసత్వంగా మారాల్సిన అవసరం ఉందని, దీని ప్రభావం ప్రజారోగ్యంపైన, వారి జీవన విధానాలపైన సానుకూల ప్రభావం చూపిస్తుంది.'

- అక్టోబరు 2న స్వచ్ఛ భారత్ మిషన్‌ను ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ అన్న మాటలు ఇవి.

ఈనాడు, సిరిసిల్ల

జిల్లా 2017లో ఓడీఎఫ్‌గా, 2022లో ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ స్థానం దక్కించుకుంది. తర్వాత వాటర్‌ప్లస్ హోదాకు వెళ్లాలి. దీనికి జిల్లాలోని పురపాలికలు, ఎంపిక చేసిన పంచాయతీల్లో మానవ ద్రవ వ్యర్థాల నిర్వహణ, మురుగునీటి శుద్ధి పూర్తిస్థాయిలో జరగాలి. జిల్లాలోని పురపాలికల్లో ఎఫ్ఎస్‌టీపీ (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)లు అందుబాటులో ఉన్నా నిర్వహణలో మాత్రం వెనకనే ఉంది. ఇప్పటికే కేంద్రం నుంచి స్వచ్ఛ భారత్ మిషన్ బృందం జిల్లాలో పర్యటించి వివరాలు సేకరించాల్సి ఉంది. ఈ ఏడాది ఆలస్యమైంది. వీటి ఆధారంగానే దేశవ్యాప్తంగా స్వచ్ఛభారత్ ర్యాంకులు ప్రకటిస్తారు. ఈ సారి జిల్లాకు చోటు లభించడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



వేములవాడలో ప్రారంభానికి నోచుకోని ఎఫ్ఎస్‌టీపీ

నీరుగారిన నిర్వహణ

సిరిసిల్ల పురపాలికలో 2019లోనే ఎఫ్ఎస్‌టీపీ వినియోగంలోకి వచ్చింది. దీని సామర్థ్యం 18 కేఎల్ (రోజుకు కిలోలీటర్లు). అంటే రోజుకు సగటున 12 వాహనాల మానవ ద్రవవ్యర్థాలు వచ్చినా నిల్వ చేసుకుని శుద్ధి చేసే సామర్థ్యం ఉంది. ప్రస్తుతం 5 కేఎల్ కూడా రావడం లేదు. అంటే పూర్తి సామర్థ్యంలో 30 శాతం కూడా శుద్ధి జరగడం లేదు.

- ద్రవవ్యర్థాలను సిరిసిల్లలోని ఎఫ్ఎస్‌టీపీకి తరలించడం, దాని నిర్వహణను మెప్మాలోని మహిళా సంఘానికి అప్పగించారు. దీనికోసం 2023లో ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ (నేషనల్ సఫాయి కర్మచారి ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) రెండు వాహనాల కొనుగోలుకు రూ.68 లక్షల రుణం మంజూరు చేసింది. ఇంత వరకు బాగానే ఉన్నా ప్రస్తుతం నిర్వహణ లేకపోవడంతో వీటి కొనుగోలుకు తీసుకున్న అప్పులకు బ్యాంకులో వాయిదాలు చెల్లించలేని పరిస్థితి ఉంది.
- వేములవాడ పురపాలికలోనూ రూ.60 లక్షల వ్యయంతో జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో ఎఫ్ఎస్‌టీపీని నిర్మించారు. రెండేళ్లుగా పనులు చివరి దశలోనే నిలిచిపోయాయి. కారణం గుత్తేదారుకు ప్రభుత్వం నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక్కడ నిర్వహణ బాధ్యతలు కూడా గుత్తేదారు సంస్థదే ఉంటుంది. దీని తర్వాత ట్రయల్ రన్ చేయాలి.
- పురపాలికలు, పంచాయతీల్లో మరుగుదొడ్ల ట్యాంకులను శుభ్రం చేసుకోవడంపై స్వచ్ఛభారత్ మిషన్ సిబ్బందితోపాటు స్థానిక అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి. అక్కడే శుభ్రం చేసుకునే విధానాన్ని వివరించేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరం. ప్రతి మూడేళ్లకోసారి జరగాలి. ఇలా చేయడం వల్ల వాటి జీవితకాలం పెరగడంతోపాటు భూగర్భ జలాలు కలుషితం కాకుండా ఉంటాయి. కానీ వీటిపై అవగాహన లేక శుభ్రతకు ముందుకు రావడం లేదు.



సిరిసిల్లలో ద్రవవ్యర్థాలను ఎఫ్ఎస్‌టీపీలో నింపుతున్న సిబ్బంది

బ్యాంకు వాయిదాలు చెల్లించలేని పరిస్థితి



2023 మార్చిలో రూ.34 లక్షల బ్యాంకు రుణంతో మానవ ద్రవ వ్యర్థాలను తరలించే వాహనాన్ని కొనుగోలు చేశాం. ప్రతి నెలా సగటున రూ.80 వేల ఆదాయం ఉంటేనే బ్యాంకుకు చెల్లించాల్సిన అసలు, వడ్డీ పోనూ రూ.20 వేల ఆదాయం ఉంటుంది. దీనిపై ప్రజలకు అవగాహన లేక ప్రస్తుతం నెలకు రూ.25 వేలకు మించి రావడం లేదు. బ్యాంకు వాయిదాలకు అదనంగా రూ.15 వేలు కలిపి కట్టాల్సి వస్తుంది. దీనికి తోడు ఎఫ్ఎస్‌టీపీలో పని చేసే నలుగురు ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఉంది.

- జమున, ఎఫ్ఎస్‌టీపీ నిర్వాహకురాలు



మూలవాగులోని బతుకమ్మ తెప్ప ప్రాంతం



మార్కెట్‌లో పూల కొనుగోళ్లతో సందడి

సద్దుల బతుకమ్మ వేడుకలకు ముస్తాబు

- వేములవాడలో నేడు నిర్వహణ
- రూ. 30 లక్షలతో భారీ ఏర్పాట్లు

న్యూస్‌టుడే, వేములవాడ

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే సద్దుల బతుకమ్మ వేడుకలకు ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడ సిద్ధమైంది. రాష్ట్రంలో ఈ వేడుకలను తొమ్మిది రోజులకు నిర్వహిస్తుండగా వేములవాడ పట్టణంలో మాత్రం ఏడు రోజులకే జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు పురపాలక సంఘం అధికారులు రూ.30 లక్షలతో భారీ ఏర్పాట్లు చేశారు. దీంతో వేములవాడలో బతుకమ్మ వేడుకల శోభ సంతరించుకుంది.

పట్టణంలో రెండో బైపాస్ రహదారిలోని మూలవాగులో బతుకమ్మ తెప్ప వద్ద ఏర్పాట్లు పెద్ద ఎత్తున చేశారు. బతుకమ్మ తెప్పనకు రంగులు వేసి నీటిని నింపి సిద్ధం చేశారు. భారీగా విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు.

★ మహిళలు ఆడుకునేందుకు వీలుగా వాగులోని ఇసుకపై కంకర బుగ్గి పోసి చదును చేశారు. పట్టణంలోని కూడళ్ల వద్ద విద్యుత్తు దీపాలను అమర్చారు.

★ ప్రజా ప్రతినిధులు, ముఖ్య అతిథులు కూర్చునే విధంగా వేదికను సిద్ధం చేశారు. స్వాగత తోరణాలు కట్టారు. నిఘా కెమెరాలు పెట్టారు. తెప్ప వద్ద రెండు భారీ ఎల్ఈడీ తెరలను సిద్ధం చేశారు. పట్టణంలోని వివిధ వార్డులతోపాటు విలీన గ్రామాల్లో ఈ వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ ఇలా...

పట్టణంలోని సుభాష్‌నగర్ వీధి నుంచి బతుకమ్మ తెప్ప వద్దకు వెళ్లే రోడ్డులో వన్‌వే ఏర్పాటు చేశారు. మంగళవారం రెండో బైపాస్ రహదారిలోకి వాహనాల అనుమతిని నిషేధించారు.

★ మల్లారం రోడ్డు నుంచి బైపాస్ రోడ్డులోకి వెళ్లే వాహనాలను కోరుట్ల బస్టాప్ నుంచి చెక్కపల్లి రోడ్డు మీదుగా మొదటి బైపాస్ నుంచి మూలవాగు వంతెన వద్దకు మళ్లించేందుకు ఏర్పాట్లు చేశారు. మాజీ ఎమ్మెల్యే అతిథి గృహం వద్ద, మూలవాగు వంతెన వద్ద బారికేడ్లు పెట్టి ట్రాఫిక్‌ను మళ్లించారు. వేడుకల సందర్భంగా భారీ భద్రత చర్యలు చేపట్టామని, పోలీసులను మఫ్టీలో దింపుతున్నట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

పూల మార్కెట్ కిటకిట

పట్టణంలో మంగళవారం జరిగే సద్దుల బతుకమ్మ వేడుకల నేపథ్యంలో సోమవారం పట్టణంలోని మార్కెట్లు జనంతో కిటకిటలాడాయి. గంగమ్మ గుడి ప్రాంతంలోని మార్కెట్, ఆలయ పరిసరాల్లోని రోడ్డు ప్రాంతం తంగేడు, గునుగు, పట్టుకుచ్చులు, బంతి వంటి వివిధ రకాల పూల విక్రయాలతో సందడిగా మారాయి. పూలు కొనుగోలుకు స్థానికులు పెద్ద ఎత్తున రావడంతో మార్కెట్ ప్రాంతాలు కిటకిటలాడాయి. మరోవైపు వివిధ షాపింగ్ మాల్స్‌లోనూ రద్దీ నెలకొంది.

హర హర మహాదేవ

వేములవాడ, న్యూస్‌టుడే: రాజన్న క్షేత్రానికి సోమవారం భక్తుల తాకిడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి రావడంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు సందడిగా మారాయి. ముందుగా ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు కోడె మొక్కులు చెల్లించుకున్నారు. దాదాపు 25 వేల మంది రాజన్నను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఈవో ఆకస్మిక తనిఖీ

ఆలయంలోని వివిధ విభాగాలను ఈవో వినోద్‌రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అద్దాల విశ్రాంతి కేంద్రం, ప్రొటోకాల్ కార్యాలయం, క్యూలైన్లు, కోడె మొక్కుల టికెట్ల విక్రయ కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.



రాజన్న ఆలయంలో భక్తజనం



హంస వాహనంపై ఊరేగిస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు

హంస వాహనంపై స్వామివార్ల విహారింపు



స్కందమాత అలంకారంలో అమ్మవారు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శ్రీ దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివార్లను ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పెద్ద సేవ హంస వాహనంపై ఊరేగించారు. నవరాత్రోత్సవాల సందర్భంగా అమ్మవారు స్కందమాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ రాజరాజేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ సమేత అనంత పద్మనాభస్వామివార్ల ఉత్సవమూర్తులను అందంగా అలంకరించిన పెద్ద సేవపై ప్రతిష్ఠించి అర్చకుల వేద మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు స్వామివార్లను దర్శించుకొని తరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఏఈవో శ్రీనివాస్, అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వినతులు అందించాం.. సమస్యలు పరిష్కరించండి

ప్రజావాణిలో 82 దరఖాస్తుల స్వీకరణ

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే:

తమ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలంటూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు అర్జీదారులు తరలివచ్చి జిల్లా యంత్రాంగానికి వినతిపత్రాలు అందజేశారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశమందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్‌లు నేరుగా దరఖాస్తులను స్వీకరించారు. ప్రజల నుంచి మొత్తం 82 వచ్చాయి. వాటిని సంబంధిత అధికారులకు అందజేసి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం గూగుల్‌మీట్ ద్వారా ఆయా మండల పరిషత్ అధికారులు, తహసీల్దార్లతో సమీక్షించి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా


ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం ఇవ్వండి



కొండాపూర్‌లోని సర్వే నంబరు 456లో 19 గుంటల భూమి ఉంది. ధరణిలో ప్రొహిబిటెడ్‌లో ప్రభుత్వ భూమిగా నమోదై ఉంది. ధరణిలో తప్పుగా నమోదు చేశారు. అందువల్ల నాపేరు మీద మీ సేవ ద్వారా సరిచేసుకోవడానికి సాధ్యం కావడం లేదు. ఆ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పాస్‌బుక్ ఇప్పించాలి.

- బొప్ప శ్రీనివాస్, గూడెం, ముస్తాబాద్ మండలం


పొరుగుసేవలో ఉద్యోగం ఇప్పించండి



నాకు రెండు కాళ్లు పని చేయవు. నేను బీఏ, బీఈడీ చేశాను. మా కుటుంబంలో పోషకుడిగా ఉండే నా తమ్ముడు కరోనాతో మరణించాడు. వృద్ధులైన నా తల్లిదండ్రుల పోషణకు ఇబ్బందిగా ఉంది. వేములవాడ మైనార్టీ గురుకులంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాన్ని పొరుగు సేవల పద్ధతిలో ఇప్పించాలి.

- గోగికారి రాము, వేములవాడ

దివ్యాంగుల పింఛను రావడం లేదు



నేను దివ్యాంగుడిని. రెండు కాళ్లు పని చేయవు. నాకు 80 శాతం అంగవైకల్యంతో సదరం సర్టిఫికెట్ కూడా ఉంది. నేను పింఛనుకు దరఖాస్తు చేసుకున్నాను. ఇది జరిగి చాలా నెలలు అయింది. అయినా పింఛను రావడం లేదు. దివ్యాంగుల పింఛను ఇప్పించాలి.

- ప్రతాపరెడ్డి, కొత్తపల్లి, గంభీరావుపేట

వేడుకలకు ఆహ్వానం



బండి సంజయ్‌ను ఆహ్వానిస్తున్న ఛైర్‌పర్సన్ మాధవి, పాలకవర్గ సభ్యులు

వేములవాడ: పట్టణంలో మంగళవారం జరిగే బతుకమ్మ వేడుకలకు రావాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ను కరీంనగర్‌లోని మహాశక్తి అమ్మవారి ఆలయంలో కలిసి మున్సిపల్ పాలకవర్గ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, పాలకవర్గ సభ్యులు మంత్రికి పూల మొక్క అందజేశారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్‌లను వారి కార్యాలయాల్లో కలిసి బతుకమ్మ వేడుకలకు ఆహ్వానించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ఉపాధ్యాయ అభ్యర్థుల తరలింపునకు ఏర్పాట్లు

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: డీఎస్సీ పరీక్షల ద్వారా ఎంపికైన వారికి ఈ నెల 9న హైదరాబాద్‌లో జరిగే నియామక పత్రాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశమందిరంలో నియామక పత్రాలు పంపిణీకి అభ్యర్థుల హాజరుకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా ఉన్న 140 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. వీరికి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అభ్యర్థులకు నియామకపత్రాలు పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 9న మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని వేదికకు చేరుకునే విధంగా వేములవాడ నుంచి ఒకటి, సిరిసిల్ల జిల్లా కేంద్రం నుంచి రెండు బస్సుల్లో అభ్యర్థులు బయలుదేరాలని తెలిపారు. అభ్యర్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముందుగా వారికి సమాచారం తెలియజేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, జిలా విద్యాధికారి రమేశ్‌కుమార్, డీఎంహెచ్‌వో వసంతరావు, డీసీఎస్ఎవో వసంతలక్ష్మి, ఆర్డీసీ వేములవాడ, సిరిసిల్ల డీఎంలు తదితరులు పాల్గొన్నారు.

కవికి విశిష్ట గజల్ పురస్కారం

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్లకు చెందిన కవి బూర దేవానందం విశిష్ట గజల్ కవి పురస్కారం అందుకున్నారు. సాహిత్యంలో విశేష కృషి చేస్తున్నందుకు గాను హైదరాబాద్ విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ వారు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన నాలుగో వార్షికోత్సవంలో దేవానందంకు ఈ పురస్కారాన్ని సోమవారం ప్రదానం చేశారు.

క్రీడలతో ఉద్యోగుల్లో స్నేహబంధం

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగించడంతోపాటు ఉద్యోగుల్లో స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలోని మినీ స్టేడియంలో పోలీస్ వార్షిక స్పోర్ట్స్ మీట్ -2024 క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం బిజీగా ఉన్నప్పటికీ సిబ్బంది క్రీడల్లో పాల్గొనడం వల్ల వారిలో నూతనోత్సాహం నింపుతుందనే ఉద్దేశంతో ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, పేర్కొన్నారు. గెలుపోటముల కంటే బృంద స్ఫూర్తి గొప్పదన్నారు. విధి నిర్వహణలో ఒత్తిడి ఉంటుందని, పోలీస్‌శాఖలో పని చేసే ప్రతి ఒక్కరూ తప్పకుండా క్రీడలు, యోగా నిత్య జీవితంలో అలవాటుగా మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, ఆర్ఐలు మధుకర్, రమేశ్, ఎస్ఐలు, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

కొత్త గురువులు వస్తున్నారు

డీఎస్సీలో ఎంపికైన వారికి రేపు నియామక పత్రాలు

న్యూస్‌టుడే-కరీంనగర్ విద్యావిభాగం

ఉమ్మడి జిల్లాలో కొంతమేర బోధన ఇబ్బందులు తొలగనున్నాయి. 2024 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. డీఎస్సీలో మెరిట్ సాధించిన అభ్యర్థులను 1:3 పద్ధతిలో ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు పిలిచి ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖలు పూర్తి చేశాయి. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందించనున్నారు. మరో వైపు వారి నియామకాలకు సంబంధించిన ఖాళీల వివరాలను సేకరించి వాటిని ప్రకటించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు సిద్ధమయ్యారు.

ప్రాథమిక పాఠశాలలకు ఊరట..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్య వేధిస్తోంది. ఇటీవల పదోన్నతులు, బదిలీలను ప్రభుత్వం చేపట్టిన అనంతరం ఎస్జీటీల కొరత తీవ్రంగా ఉంది. చాలామందికి పదోన్నతులు రావడం ఇందుకు కారణం. బదిలీ పొందిన పలువురు ఉపాధ్యాయులు రిలీవర్ లేని కారణంగా అదే పాఠశాలల్లో పని చేస్తున్నారు. డీఎస్సీ ప్రకటన వెలువడిన అనంతరం ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించడం, బదిలీ చేయడంతో పెద్ద సంఖ్యలో ఖాళీలు ఏర్పడ్డాయి. ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కొంతమేరకు ఉంటుంది. ప్రస్తుతం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు జరుగుతుండటంతో ఈ సమస్య తీరనుంది. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీల కొరతకు కొంత ఊరట లభించనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వారి నియామకాలు జరిగినా ఇంకా ఎస్జీటీల కొరత పలు పాఠశాలలను వేధించనుంది. జగిత్యాల జిల్లాలో 441, కరీంనగర్‌లో 311, పెద్దపల్లిలో 158, రాజన్న సిరిసిల్లలో 231 ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



కరీంనగర్‌లో డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

జిల్లాల వారీగా నియామక పోస్టుల వివరాలు..

విభాగం	జగిత్యాల	కరీంనగర్	పెద్దపల్లి	రాజన్న సిరిసిల్ల
స్కూల్ అసిస్టెంట్	99	86	49	56
భాషా పండితులు	39	18	5	12
పీఈటీలు	8	7	1	4
ఎస్జీటీలు	161	114	21	67
స్పెషల్ ఎడ్యుకేటర్(ఎస్ఏ)	5	5	5	3
ఎస్జీటీ	22	15	12	9
మొత్తం	334	245	93	151

బతుకమ్మ పాటలు.. కోలాటాలు





ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ధర్మగుండంలో నిమజ్జనం చేస్తున్న మహిళలు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ ప్రాంగణంలో సోమవారం పట్టణ మహిళలు, యువతులు, బతుకమ్మ పాటలు, కోలాటాలతో ఆడి పాడి సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను ధర్మగుండంలో నిమజ్జనం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా...

(10 AM TO 1 PM)
వీర్నపల్లి: 91541 18151
బోయినపల్లి: 84999 90001

న్యూస్‌టుడే, సిరిసిల్ల అర్బన్

? సిరిసిల్లలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కార్గిల్ చెరువులోని వరద సాయినగర్ ప్రధాన కాలువలోకి రావడంతో మురుగు, మట్టితో నిండిపోయింది. దీనితో దుర్గంధం వస్తోంది. ఈగలు, దోమల బెడద పెరిగింది. అధికారులు స్పందించి కాలువలోని మట్టి తొలగించాలి.
- రమేశ్, సాయినగర్ కాలనీ

✔ ప్రధాన కాలువలోని మట్టిని పారిశుద్ధ్య కార్మికులకు చెప్పి వెంటనే తొలగిస్తాం. **- కృష్ణ, పారిశుద్ధ్య విభాగం ఇన్‌ఛార్జి, సాయినగర్**

గడ్డి తొలగింపు

ఈనాడు స్పందనకు వందనం

గంభీరావుపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని 11వ వార్డులో మురుగు కాలువ పక్కన గడ్డి పేరుకుపోయినా తొలగించలేదు. దీనిపై ఈనెల 7న 'ఈనాడు'లో 'ఇదేనా స్వచ్ఛత' అనే శీర్షికన ప్రచురించిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. సోమవారం సాయంత్రం పారిశుద్ధ్య సిబ్బందితో గడ్డిని తొలగింపజేసి శుభ్రం చేయించారు.

పొలం ఒడ్డుపై నుంచి జారిపడి రైతు మృతి


ఉప్పలయ్య

నామాపూర్ (ముస్తాబాద్), న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు పొలం ఒడ్డుపై నుంచి జారిపడి రైతు మృతి చెందిన సంఘటన ముస్తాబాద్ మండలం నామాపూర్‌లో సోమవారం వెలుగుచూసింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు... నామాపూర్ గ్రామానికి చెందిన తాడేపు ఉప్పలయ్య (60)కు దాదాపు ఎకరం పొలం ఉంది. ఆదివారం సాయంత్రం విద్యుత్తు మోటారు బంద్ చేసి వస్తానని చెప్పి పొలం వద్దకు వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోయే సరికి వెళ్లి చూడగా ఒడ్డుపై నుంచి జారి పడి పొలంలోనే విగతజీవిగా మారాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను కారణాలు అడిగి తెలుసుకున్నారు. శవాన్ని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య సత్తవ్వ, కుమారుడు శేఖర్ ఉన్నారు. కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ వెల్లడించారు.

రూ.15 లక్షలతో సీఏ పరారీ

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీకి చెందిన మహిళా సంఘాలకు సంబంధించిన సీఏ కల్యాణి గ్రామంలోని 9 మహిళా సంఘాలకు సంబంధించిన రూ.15 లక్షలతో మూడు రోజుల కిందట పరారైనట్లు సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్ సోమవారం తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రుద్రంగి, న్యూస్‌టుడే: చందుర్తి మండలం జోగాపూర్‌లో పలువురు వ్యక్తులకు చెందిన ఇళ్లలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు చందుర్తి ఏఎస్ఐ బాపురావు తెలిపారు. గంగిరెడ్డులకాలనీలో పట్టుబడిన ఈ బియ్యాన్ని చందుర్తి పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సుమారు 50 క్వింటాళ్లు ఉంటాయని ఆయన తెలిపారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి హఠాన్మరణం

అయిదు రోజుల వ్యవధిలో దంపతుల మృతితో విషాదం


జనార్దన్

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు రేణికింది జనార్దన్ (70) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన సతీమణి సులోచన మరణించిన అయిదు రోజుల వ్యవధిలోనే ఆయన తనువు చాలించడంతో గ్రామంలో విషాదం నెలకొంది. వేములవాడ మండలం నూకలమర్రి గ్రామానికి చెందిన జనార్దన్ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సుమారు ఐదున్నర ఏళ్లపాటు పని చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం కరీంనగర్‌లో స్థిరపడ్డారు. భార్య మరణాన్ని తట్టుకోలేక ఒక్కసారిగా అనారోగ్యానికి గురై మృత్యువుడికి చేరుకోవడంతో ఎల్లారెడ్డిపేటలో విషాదం నింపింది. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయన మృతి పట్ల భారాస జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పూర్వ విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు.

నిధులు కేటాయించాలని కేంద్ర సహాయ మంత్రికి వినతి

బోయినపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను జిల్లాలోని విశ్వబ్రాహ్మణ విశ్వ కర్మ ఐక్య సంఘం మండల అధ్యక్షుడు ఉదారి నరసింహాచారి సోమవారం కరీంనగర్‌లో కలిశారు. జిల్లాలోని ప్రతి మండలానికి సామాజిక భవన నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరినట్లు బోయినపల్లి మండల అధ్యక్షుడు ఉదారి నరసింహాచారి తెలిపారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

రుద్రంగి, న్యూస్‌టుడే: యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ పేర్కొన్నారు. చందుర్తి మండలం మూడపల్లిలో జరుగుతున్న క్రికెట్ పోటీలను ఆయన సందర్శించారు. పలు గ్రామాలకు చెందిన క్రీడాకారులకు టీషర్టులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ శివారు... చెత్తతో బేజారు

న్యూస్‌టుడే, వేములవాడ

వేములవాడ పట్టణ శివారు ప్రాంతాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. రహదారుల పక్కన ఎక్కడ పడితే అక్కడ చెత్త, వ్యర్థాలు పారేయడంతో దుర్వాసన వచ్చి వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వివిధ దుకాణాలు నిర్వహించే వారితో పాటు పట్టణవాసులు పలువురు కోళ్లు, ఇతర వ్యర్థాలను వేస్తున్నారు. దీంతో అవి కుళ్లిపోయి దుర్గంధం రావడంతో అటువైపు వెళ్లే వాహనదారులు ముక్కుమూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణంలో గంగమ్మగుడి ప్రాంతంలోని పార్కు వద్ద కూరగాయల వ్యాపారులు వ్యర్థాలను పక్కనే మూలవాగు వైపు వేస్తున్నారు. దీంతో అవి కుళ్లిపోయి దుర్వాసన రావడంతో పార్కుకు వచ్చే వారు ఇబ్బందిపడుతున్నారు. అయినా పురపాలక సంఘం అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


పట్టణంలోని మల్లారం రోడ్డు పక్కన చెత్త

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

పట్టణంలో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. చెత్త సేకరణ వాహనాలకు చెత్తను అందజేయాలని పట్టణ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కడ చెత్త వేసినా చర్యలు తీసుకుంటాం. **- సంపత్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వేములవాడ**

ఎక్కడెక్కడ వేస్తున్నారంటే..

- పట్టణంలో మొదటి బైపాస్‌లోని మూల వాగు బఫర్ జోన్ ప్రాంతం
- మూలవాగు వంతెనకు తూర్పు వైపు
- గంగమ్మ గుడి వద్ద పార్కు పక్కన
- మల్లారం వైపు వెళ్లే రోడ్డులోని కాలువ పక్కన
- రెండో బైపాస్ రహదారిలో అక్కడక్కడ


పట్టణంలోని గంగమ్మ గుడి పార్కు పక్కన మూలవాగులో వేసిన కూరగాయల వ్యర్థాలు

- చెక్కపల్లి రహదారి విద్యుత్తు ఉప కేంద్రం ప్రాంతంలో
- గుడి చెరువు కట్ట కింద రహదారి వెంబడి
- వీవీపీ రోడ్డులో చెరువు వైపు
- మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలో ఓపెన్ జిమ్ గోడ పక్కన
- కోరుట్ల రోడ్డులోని కట్టు కాలువ వద్ద
- బతుకమ్మ తెప్ప, శ్మశాన వాటికల వద్ద వేస్తున్నారు.


తంగళ్లపల్లిలో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లాకు నూలు డిపో మంజూరుకు కృషి చేసిన వారందరి చిత్రపటానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాల్గం ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు నేరెల్ల నర్సింగంగౌడ్, మోర రాజు, మచ్చ శ్రీనివాస్, గడ్డం మధుకర్, పెద్దూరు తిరుపతి, పొన్నం లక్ష్మణ్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, ప్రశాంత్, మోర లక్ష్మీరాజం, శామల రమేశ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు కృషి

వట్టిమల్ల (కోనరావుపేట), న్యూస్‌టుడే: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు నిరంతరం కృషి చేస్తున్నట్లు సెస్ ఉపాధ్యక్షుడు దేవరకొండ తిరుపతి పేర్కొన్నారు. కోనరావుపేట మండలం వట్టిమల్లలో నూతనంగా నిర్మించిన 25 కేవీ విద్యుత్తు నియంత్రికను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లోఓల్టేజీ, విద్యుత్తు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సెస్ ఏఈ దివ్య, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, నాయకులు పుంగం గౌడ్, దేవరాజు, శేఖర్, పాల్గొన్నారు.


విద్యుత్తు నియంత్రికను ప్రారంభిస్తున్న సెస్ ఉపాధ్యక్షుడు తిరుపతి

దుర్గామాతకు కుంకుమ పూజలు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాతకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఇళ్ల నుంచి మంగళహారతులతో మండపాలకు చేరుకొని కుంకుమ పూజలు చేశారు.
- న్యూస్‌టుడే బృందం


దుర్గామాతకు పూజలు చేస్తున్న ఎస్సై రామ్మోహన్, మండల కాంగ్రెస్ నాయకులు, యువకులు


వెంకంపేటలో ...


ధర్మారంలో...


కొలనూర్‌లో...


రాచర్ల గొల్లపల్లిలో ...


పోత్గల్‌లో...


సిరిసిల్లలో పూజలు నిర్వహిస్తున్న పుర ఛైర్‌పర్సన్ కళ


చందుర్తిలో ...


రాచర్ల బొప్పాపూర్‌లో...


సిరిసిల్ల పద్మనగర్‌లో...


గంభీరావుపేటలో...


తంగళ్లపల్లి మార్కండేయ దేవాలయంలో ...


తడగొండలో ...


ఎల్లారెడ్డిపేటలో ...

కాటన్ అనుబంధ పరిశ్రమలను కాపాడండి

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అందించే చీరల తయారీ ఆర్డర్లను కాటన్ కలిపి తయారు చేసే వారికి ఆర్డర్లను ఇస్తూ కాటన్ అనుబంధ పరిశ్రమలను కాపాడాలని కాటన్ వస్త్రపరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక కార్యాచరణ కమిటీ నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో సిరిసిల్లలో ఎక్కువ భాగం కాటన్ వస్త్రం తయారు చేసేవారని, గత ప్రభుత్వంలో కాటన్ అనుబంధ పరిశ్రమ ఉత్పత్తిదారులను బలవంతంగా అదుపులోకి తీసుకొని పాలిస్టర్ బతుకమ్మ చీరలు ఉత్పత్తి చేయించడం వల్ల గడిచిన కొద్ది సంవత్సరాల్లో కాటన్ అనుబంధ వస్త్ర వ్యాపారాలు నష్టాలకు గురై చాలా వరకు మూడపడ్డాయని తెలిపారు. ప్రస్తుతం కొన్ని మరమగ్గాలు, అనుబంధ పరిశ్రమలు నామమాత్రంగా నడుస్తున్నాయని, అందులోని కార్మికులు సరైన ఉపాధి లేక ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం సిరిసిల్లలో కాటన్ అనుబంధ వస్త్ర పరిశ్రమల ద్వారా నెలకు సుమారు 75 లక్షల మీటర్ల వస్త్రం తయారు చేసే అవకాశం ఉందని వివరించారు. ప్రభుత్వం ఆర్డర్ ఇస్తే కాటన్ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న నేత కార్మికులకు ఉపాధి లభిస్తుందని, కాటన్ పరిశ్రమకు పూర్వవైభవం వస్తుందన్నారు. కార్యక్రమంలో సైజింగ్ యజమానుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌడ సురేశ్, కార్యదర్శి గాజుల రవి, సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, కార్యదర్శి గౌడ రాజు, సిరిసిల్ల యార్న్ అసోసియేషన్ అధ్యక్షుడు పిస్క మధు, కార్యదర్శి గెంట్యాల గోపి, కట్టెకోల లక్ష్మీనారాయణ, కోడం అశోక్, చిలుక రాజేశం, కోడం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ఐక్యవేదిక నాయకులు

గాజాపై దాడులకు వ్యతిరేకంగా నిరసన


నిరసన తెలుపుతున్న నాయకులు

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్లలోని అంబేడ్కర్ చౌక్ వద్ద వామపక్ష పార్టీల నాయకులు గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి సోమిశెట్టి దశరథం, సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, బొద్దుల శ్రీహరి, సత్తయ్య, పాండు, మంత్రి చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ప్రపంచ దేశాలు ప్రతిఘటించాలని కోరుతూ సీపీఎం నాయకులు సోమవారం వేములవాడ పట్టణంలోని నందికమాన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ అమెరికా అండతోనే ఇజ్రాయిల్ పాలస్తీనా, లెబనాన్‌లపై వైమానిక దాడులు చేస్తూ అమాయక ప్రజలను పొట్టన పెట్టుకుంటుందని ఆరోపించారు. ఐక్యరాజ్య సమితి ఆదేశాలను ఇజ్రాయిల్ బేఖాతర్ చేస్తూ దాడులకు తెగబడుతుందన్నారు. దాడులు నిలిపివేసేందుకు ప్రపంచ దేశాలు కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సైకిలాబ్‌బాబు, మూషం రమేశ్, ఎల్లారెడ్డి, విమల, అశోక్, నాగరాజు, రమణ, అరుణ్‌కుమార్, పద్మ, శ్రీధర్, ప్రశాంత్, సదానందం, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో జాప్యంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

వీర్నపల్లి, న్యూస్‌టుడే: వీర్నపల్లి మండలం వన్‌పల్లికి చెందిన పలువురు గిరిజనులు సోమవారం ప్రజావాణికి తరలివెళ్లారు. శంకర్‌నాయక్‌తండాకు బీటీ రోడ్డు మంజూరైనప్పటికీ నిర్మాణంలో జాప్యం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో భాజపా ఎస్టీ మోర్చా జిల్లా కార్యదర్శి లక్‌పతి, తిరుపతి, రవి, సురేశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకల ఏర్పాట్లు పరిశీలన

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలో మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించే బతుకమ్మ వేడుకల నిర్వహణ ఏర్పాట్లను సోమవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, భాజపా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణతో కలిసి పాలకవర్గ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ దాదాపు రూ.30 లక్షల వ్యయంతో మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లోని కూడళ్ల వద్ద, విలీన గ్రామాల్లో విద్యుతు దీపాల ఏర్పాటు, బతుకమ్మ ఆడే ప్రాంతాలను చదును చేయడం వంటి పనులు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ బింగి మహేశ్, ఇన్‌ఛార్జి కమిషనర్ సంపత్ రెడ్డి, ఏఈ నర్సింహ స్వామి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాధవి, భాజపా జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, కౌన్సిలర్లు

బతుకమ్మ సంబరాలు


కోర్టు ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణంలోని కోర్టు ఆవరణలో బతుకమ్మ వేడుకలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత, మహిళా న్యాయవాదులు సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. బతుకమ్మలను పేర్చి కోర్టు ఆవరణలో ఆడిపాడారు. కోలాటం ఆడుతూ సందడి చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మహిళా న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో బతుకమ్మ వేడుకలను ఆరో రోజు సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. ప్రధాన కూడళ్లకు చేరుకొని బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. అనంతరం సమీపంలోని జలవనరుల్లో నిమజ్జనం చేశారు.

దుబాయిలో ...


వేములవాడ: దుబాయిలో జరిగిన బతుకమ్మ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. దుబాయిలోని ఈటీసీఏ, గల్ఫ్ తెలంగాణ సంఘం, స్పార్క్ మీడియా ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి బతుకమ్మ వేడుకలు, అబుదాబిలోని టాడ్ ఆధ్వర్యంలో దసరా వేడుకలు నిర్వహించగా విప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విప్ మాట్లాడుతూ గల్ఫ్ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం గల్ఫ్ కార్మికుడు మరణిస్తే రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు.



ప్రభుత్వ విప్‌ను సత్కరిస్తున్న ప్రవాస భారతీయులు

మలేసియాలో దీనస్థితిలో వలసజీవి

స్వగ్రామం రప్పించాలని ప్రభుత్వ విప్‌నకు విజ్ఞప్తి


కల్లూరు మోహన్

కోనరావుపేట, న్యూస్‌టుడే: బతుకుదెరువు నిమిత్తం అప్పు చేసి మలేసియా వెళ్లగా, అక్కడ పరిస్థితులు అనుకూలించక అనారోగ్యానికి గురైన దయనీయస్థితి నెలకొంది. కోనరావుపేట మండలం కొలనూర్ గ్రామానికి చెందిన కల్లూరి మోహన్ అప్పు చేసి అయిదేళ్ల కిందట మలేసియా వెళ్లగా సరైన పని లభించలేదు. ఆర్థిక ఇబ్బందులు అలాగే ఉండిపోయాయి. దీనికి తోడు అనారోగ్యానికి గురై, స్వయంగా ఫోన్‌లో మాట్లాడే పరిస్థితి లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. స్వగ్రామం రప్పించాలని దుబాయి పర్యటనలో ఉన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు. స్పందించిన విప్ పూర్తి వివరాలు పంపించాలని వెంటనే ఆయన క్యాంపు కార్యాలయ సిబ్బందికి సూచించారు.

రైతేరాజు

వేరుసెనగ సాగుకు వేళాయే..



జె.విజయ్, శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, జమ్మికుంట



వేరుసెనగ పంట

న్యూస్‌టుడే, జమ్మికుంట

వేరుసెనగ సాగులో రైతులు మొదటి నుంచే జాగ్రత్తలు పాటిస్తే మంచి ఫలితాలు ఉంటాయని జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త జె.విజయ్ తెలిపారు. ఉత్తర తెలంగాణలో అక్టోబర్ రెండో పక్షంలో విత్తుకోవచ్చని పేర్కొన్నారు. వేరుసెనగ సాగుకు సంబంధించి పాటించాల్సిన పలు అంశాలను ఆయన ఈ మేరకు వివరించారు.

అనువైన నేలలు: ఇసుకతో కూడిన గరక నేలలు లేదా త్వరితంగా నీరు ఇంకే ఎర్రనేలలు వేరుసెనగ సాగుకు అనువైనవి.

విత్తనాల ఎంపిక, మోతాదు: యాసంగిలో నీటివసతి ఉండే ప్రాంతాల్లో కదరి-6, కదరి-9, టీఏజీ-24, హరితాంధ్ర, ఐసీజీఎస్-91114, టీసీజీఎస్-1694 (విశిష్ట), ధరణి మేలైన రకాలు. గింజ బరువు, విత్తే సమయాన్ని బట్టి విత్తిన మోతాదు మారుతుంది. యాసంగిలో ఎకరానికి 60-80 కిలోల విత్తనం సరిపోతుంది.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి 1 గ్రాము టెబ్యుకొనజోల్ లేదా 3 గ్రాముల మాంకోజెబ్ పొడి మందు పట్టించాలి. కాండం కుళ్లు వైరస్ తెగుళ్లు వ్యాపించే ప్రాంతాల్లో 2 మి.లీ.ఇమిడ్లోప్రిడ్‌ను 7 మి.లీ. నీటిలో కలిపి కిలో విత్తనానికి పట్టించాలి.

విత్తే దూరం: సాళ్ల మధ్య దూరం 22.5 సెం.మీ., మొక్కల మధ్య 10 సెం.మీ. దూరం ఉండేలా విత్తుకోవాలి.

ఎరువుల యాజమాన్యం: ఎకరానికి 100 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 18 కిలోల యూరియాను విత్తే సమయంలో వేయాలి. విత్తిన 30 రోజుల తర్వాత తొలిపూత దశలో మరో సారి 10 నుంచి 15 కిలోల యూరియాను వేయాలి.

■ ఎకరానికి 200 కిలోల జిప్సమ్‌ను పూత పూర్తయ్యి ఊడలు దిగే సమయంలో మొదళ్ల దగ్గర వేసి మట్టిని ఎగదోయాలి. విత్తిన 45 రోజుల తర్వాత ఎలాంటి అంతర సేద్యాన్ని చేపట్టవద్దు.

కలుపు నివారణ: కలుపు మొలకెత్తక ముందు పెండిమిథాలిన్ 30% ఇ.సి. ఎకరానికి 1.30 నుంచి 1.60 లీ. వంతున 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. విత్తిన 20 రోజుల వరకు కలుపు తీసేందుకు వీలుకాని పరిస్థితుల్లో కలుపు 2-3 ఆకుల దశలో ఉన్నప్పుడు ఇమాజితాపైర్ 10% మందు 300 మి.లీ.లను ఎకరానికి 200 లీటర్ల నీటితో కలిపి విత్తిన వెంటనే లేదా 20-30 రోజుల్లో పిచికారీ చేస్తే అన్ని రకాల కలుపును నివారించవచ్చు.

నీటి యాజమాన్యం: యాసంగిలో వేరుసెనగ సాగుకు తేలిక నేలలో 6 నుంచి 8 తడులు ఇవ్వాలి. పైరులో ఊడలు దిగే దశ నుంచి కాయలు ఊరే దాకా (విత్తిన 45-50 రోజుల నుంచి 85-90 రోజుల వరకు) నీరును తగిన మోతాదులో కట్టాలి.

పంట కోతను గుర్తించటం: వేరుసెనగలో 75 శాతం కాయలు పూర్తిగా పక్వానికి వచ్చినప్పుడే కోయాలి. కాయల్లోని భాగం ముదురు గోధుమ రంగులోకి మారినప్పుడు కోతకు వచ్చిందని గుర్తించాలి.

దిగుబడులపై పోషకాల ప్రభావం

మీకు తెలుసా?

అన్నిరకాల పంటల్లోనూ అధిక వర్షం, బెట్ట, చలి, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు, గాలిలో తేమ, నేలతీరును బట్టి పోషకలోపాలు తలెత్తి మొక్కల ఎదుగుదల దిగుబడులను, ఉత్పత్తుల నాణ్యతను ప్రభావితం చేస్తాయి. నత్రజని, భాస్వరాన్ని అధికంగా, పొటాష్‌ను పరిమితంగా వాడుతున్నారు. వీటితోపాటు ఉపపోషకాలైన మెగ్నీషియం, కాల్షియం, గంధకం, సూక్ష్మపోషకాలైన జింకు, కాపర్, ఐరన్, మాంగనీసు, బోరాన్, మాలిబ్డినం, క్లోరిన్ తదితరాలు పంటలకు అవసరం ఉంటాయి. పైర్లపై తలెత్తే ఈ పోషక లోపాలను సకాలంలో గుర్తించి సరిదిద్దాలి.

\- న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం



రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం



రైతుల సందేహాలను పొలాస పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.బలరాం నివృత్తి చేశారు.

? వరిలో కంకినల్లిని ఎలా అరికట్టాలి - రాజమల్లయ్య, కండ్లపల్లి

✓ డైకోఫాల్ 5.0 మి.లీ. లేదా స్పైరోమెసిఫెన్ 1.0 మి.లీ., ప్రొపికొనజోల్ 1.0 మి.లీ.మందును ఒక లీటరు నీటికి వంతున కలిపి అవసరం మేరకు వారం, పది రోజుల వ్యవధితో రెండు సార్లు పైరుపై పిచికారీ చేయాలి.

భూమి తక్కువ.. లాభాలు ఎక్కువ



న్యూస్‌టుడే, సారంగాపూర్

ఉన్న కొద్దిపాటి భూమితో లాభాలు ఆర్జిస్తున్నారు సారంగాపూర్ మండలంలోని పోచంపేట రైతులు. ఎప్పుడు ఏదో కూరగాయ పంటను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



బెండ తోటలో రైతు నారాయణ

విభిన్న పంటలు

గడప నారాయణకు రెండెకరాల భూమి ఉంది. ప్రస్తుతం 4 గుంటల్లో బెండ, అయిదు గుంటల్లో చిక్కుడు, నాలుగు గుంటల్లో మిరప సాగు చేపట్టారు. ఇప్పటికే బెండతో లాభాలు పొందుతున్నారు. విత్తనాలకు రూ.1,600, సేంద్రియ ఎరువుకు రూ.6 వేలు, ఇతరత్రా రూ.5 వేల పెట్టుబడి పెట్టారు. బెండకాయల విక్రయం ద్వారా రోజుకు రూ.300ల చొప్పున దాదాపు 90 రోజులు విక్రయించి రూ.25 వేలకు పైగా ఆదాయం పొందినట్లు తెలిపారు. త్వరలోనే చిక్కుడు దిగుబడి అందుబాటులోకి రానుందని.. దీని ద్వారా రోజు రూ.500ల చొప్పున కనీసం మూడు నెలల పాటు ఆదాయం రానుందని తెలిపారు. పంట చుట్టూ తీగజాతి అయిన సొరను సాగు చేశామని.. మరో 10 గుంటల్లో టమాట సాగుకు సిద్ధం చేసినట్లు నారాయణ వివరించారు.

రూ.లక్ష ఆదాయం

గ్రామానికి చెందిన గడప సత్తన్న 10 గుంటల విస్తీర్ణంలో బెండ సాగు చేశారు. విత్తనాల కోసం రూ.2,500 వ్యయం చేయగా, ఇతర ఖర్చుల కింద రూ.2 వేలు పెట్టుబడి పెట్టారు. 45 రోజులకు బెండ కాతకు వచ్చింది. మూడు నెలల పాటు రోజుకు రూ.1,000 నుంచి రూ.1500ల వరకు ఆదాయం వచ్చినట్లు సత్తన్న పేర్కొన్నారు. మొక్కజొన్న సాగు చేసి అంతర పంటగా ఏడు గుంటల విస్తీర్ణంలో చిక్కుడు సాగు చేయగా ప్రస్తుతం కాత దశకు చేరుకుంది. తక్కువ విస్తీర్ణంలో ఏదోరకం కూరగాయల పంట సాగు చేపడితే రోజూ చేతిలో డబ్బులు ఉంటాయని ఈ రైతులు వెల్లడించారు.

విదేశాలకు స్వదేశీ రుచులు!

సులభంగా తినుబండారాలు, వస్తువుల బట్వాడా ■ విస్తరిస్తున్న కొరియర్ సంస్థలు





విద్య, ఉద్యోగం, ఉపాధి, వ్యాపారం నిమిత్తం ఏటా ఉమ్మడి జిల్లా నుంచి విదేశాలకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఇప్పటికే అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లాంటి దేశాల్లో స్థిరపడిన ఇక్కడి కుటుంబాలు చాలానే ఉన్నాయి. ఈక్రమంలో ఇక్కడి తినుబండారాలు, పచ్చళ్లకు విదేశాల్లో గిరాకీ ఏర్పడింది. అక్కడి ఆహార పదార్థాలు నచ్చక, చేసుకోవడానికి సమయం లేక, ఆరోగ్యం తదితర కారణాలతో ఇక్కడి నుంచి బట్వాడా చేసుకొంటున్నారు. మందులు, వంట సామగ్రి, పప్పులనూ ఇక్కడి నుంచి ఇతర దేశాలకు పంపిస్తుండటంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో కొరియర్ సంస్థలు పెరిగాయి.

\- న్యూస్‌టుడే, తెలంగాణచౌక్ (కరీంనగర్)

తినుబండారాలే అధికం..

అమెరికా, ఇంగ్లాండ్‌లాంటి దేశాల్లో భార్యాభర్తలు ఉద్యోగం చేస్తేనే కుటుంబ పోషణతో పాటు డబ్బు పొదుపు చేసుకోవడానికి వీలుంటుంది. విధులు నిర్వర్తించడం, ఖాళీ సమయం ఎక్కువ ఉండకపోవడంతో, ఆరోగ్యం, రుచులపరంగా ఇంటి నుంచి తెప్పించుకోవడానికి ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సాయంతో లేదా కొరియర్ ద్వారా తెప్పించుకుంటున్నారు. దీనికి అనుగుణంగా కొరియర్ సంస్థలు ఫెడెక్స్, యూపీఎస్, డీహెచ్ఎల్, ఇతర సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకొని పార్సిళ్లను పంపిస్తున్నాయి. ఎక్కువగా పచ్చళ్లు, మిఠాయిలు, పిండి పదార్థాలు, మందులు(మెడిసిన్స్) విదేశాలకు కొరియర్ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రూ.కోట్లలో వ్యాపారం

కిలో పార్సిల్‌కు రూ.2800, 10 కిలోల పైన ఉంటే కిలోకు రూ.660-700 చొప్పున, మందులకు అయితే రూ.3400(500 గ్రాములు) తీసుకుంటున్నారు. విదేశాలకు కొరియర్లు పంపించే వ్యాపారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏటా రూ.2 కోట్లపైగా జరుగుతుందని చెప్పారు. దసరా, సంక్రాంతి, పచ్చళ్ల సీజన్లలో గిరాకీ అధికంగా ఉంటుందన్నారు. కరీంనగర్‌లో విదేశాలకు పంపే ప్రధాన కొరియర్ సంస్థలు అయిదు ఉన్నాయి.

సీజన్‌లో అధికంగా..

ఎక్కువగా అమెరికాకు పార్శిళ్లు వెళ్తుంటాయి. రోజువారీగా కొరియర్లు తక్కువగానే ఉన్నా సంక్రాంతి, దసరా పండుగలప్పుడు ఎక్కువగా ఉంటాయి. వినియోగదారుడు పార్సిల్ బుక్ చేసుకున్న తర్వాత అతనికి లింక్ పంపిస్తాం. దాని ద్వారా పార్సిల్ ఎక్కడ ఉంది. డెలివరీ అయిందా? అనే వివరాలు తెలుసుకోవచ్చు. మేము 100కు పైగా దేశాలకు వస్తువులు పంపుతుంటాం.

\- గడ్డం విలాస్‌రెడ్డి, కొరియర్ సంస్థ నిర్వాహకుడు



కొరియర్ సంస్థలో పార్సిళ్లను సీల్ చేస్తూ..

వందకుపైగా దేశాలకు..

■ కరీంనగర్ నుంచి అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, జర్మనీ, కెనడా, సింగపూర్, మలేషియా తదితర 100 దేశాలకు పార్సిళ్లను పంపించే వెసులుబాటును కొరియర్ సంస్థలు అందిస్తున్నాయి.

■ మందులు పంపితే వైద్యుడి ప్రిస్క్రిప్షన్, ఆధార్, చరవాణి నంబరు, స్వీకరించే వ్యక్తికి సంబంధించిన పాస్‌పోర్టు జిరాక్స్ ప్రతులు, చిరునామా తప్పనిసరిగా జత చేయాలి.

■ ప్రతి రోజు కరీంనగర్ నుంచి 15 నుంచి 20 వరకు, నెలకు దాదాపు 500కుపైగా.. పండుగల(సంక్రాంతి, దసరా) సీజన్లలో అయితే రోజుకు 200 నుంచి 300 వరకు, నెలకు 3 వేలకు పైగా విదేశాలకు పార్సిళ్లు వెళ్తుంటాయని నిర్వాహకులు తెలిపారు. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి గల్ఫ్ వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో వారు కరీంనగర్ వచ్చి కొరియర్ చేస్తారు.

■ పార్సిళ్లల్లో 80 శాతం అమెరికాకే బుక్ అవుతుండగా యూకే(10 శాతం), ఆస్ట్రేలియా, సింగపూర్, గల్ఫ్ తదితర దేశాలకు మరో పది శాతం వెళ్తున్నట్లు ఓ కొరియర్ నిర్వాహకుడు పేర్కొన్నారు.

■ సోమవారం పార్సిళ్లు బుకింగ్ చేస్తే.. ఆ దేశాలకు శుక్రవారం చేరే అవకాశముంది. శని, ఆదివారం సెలవు కావడంతో వాటిని తీసుకోవడానికి ఇంటి వద్ద ఉంటారనే ఉద్దేశంతో సోమవారం ఎక్కువ బుక్ చేస్తున్నారు.

■ బంగారం, వెండి, కొబ్బరి(కుడకలు), కొబ్బరి పొడి, నూనెలు, బ్లేడ్లు, పిన్నీసులు, పిన్నులు, కరివేపాకు, మండే స్వభావం కలిగిన వస్తువులు కొరియర్ చేయడానికి వీల్లేదు.


కారు కొనటానికి తండ్రి నిరాకరణ.. తనయుడి బలవన్మరణం



మహేందర్

జమ్మికుంట, న్యూస్‌టుడే: దళిత బంధు నిధులతో కొన్న ట్రాక్టర్ విక్రయించి కారు కొనాలని అడగ్గా తండ్రి నిరాకరించడంతో తనయుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన జమ్మికుంట మండలం పాపయ్యపల్లిలో జరిగింది. సీఐ రవి, గ్రామస్థుల కథనం మేరకు.. పాపయ్యపల్లికి చెందిన శనిగరపు భద్రయ్య గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. దళిత బంధు పథకం యూనిట్ కింద ట్రాక్టర్ తీసుకున్నాడు. ట్రాక్టర్‌ను విక్రయించి కారు కొనాలని ఆదివారం భద్రయ్యను అతని కుమారుడు మహేందర్(22) అడగ్గా నిరాకరించాడు. దీంతో మహేందర్ పురుగు మందు తాగాడు. వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో రాత్రి మృతి చెందాడు. సోమవారం మృతుడి భద్రయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

బతుకమ్మ పూలకు వెళ్లి.. బావిలో పడి మృత్యువాత



కాళిదాసు

గన్నేరువరం, న్యూస్‌టుడే: బతుకమ్మ పండగ సమీపిస్తున్న క్రమంలో పూల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గన్నేరువరం మండలం జంగపల్లిలో జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబసభ్యుల కథనం మేరకు.. జంగపల్లికి చెందిన గుంటుక కాళిదాసు(40) ఆదివారం బతుకమ్మ పూల కోసమని బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం కాళిదాసు మృతదేహం గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో తేలడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఎస్సై నరేష్ దర్యాప్తు చేపట్టారు.

పొదుపు సంఘాల్లో పేరుకుపోతున్న మొండి బకాయిలు

● అప్పులు చెల్లించని సంఘాలపై దృష్టి

● మనుగడలోకి తీసుకొచ్చేందుకు ప్రణాళిక

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్:

స్వయం సహాయక సంఘాల్లో మొండి బకాయిలు పేరుకుపోతున్నాయి. అప్పులు చెల్లించడంలో కొందరు మహిళా సంఘాల సభ్యులు ఏళ్ల తరబడి ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో లావాదేవీలు నిలిచిపోవడంతో సంఘాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ క్రమంలో ఆర్థిక స్వావలంబనపై ప్రభావం చూపుతున్న బకాయిల వసూళ్లపై గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామాల వారీగా సంఘాల జాబితా రూపొందించి.. క్షేత్ర స్థాయిలో వాటికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. సభ్యులను సంఘటితం చేసి కిస్తీలు చెల్లింపుతో పాటు పొదుపు బాట పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు.



ఎలిగేడు మండలం దూళికట్టలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉమ్మడి జిల్లాలో మహిళ సంఘాల మొండి బకాయిల వివరాలు

	సంఘాలు	సొమ్ము(రూ.కోట్లలో)
పెద్దపల్లి	460	12.95
జగిత్యాల	247	6.07
కరీంనగర్	231	7.48
రాజన్నసిరిసిల్ల	93	2.96

ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం

- రవీందర్ రాథోడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, పెద్దపల్లి

జిల్లాలో మొండి బకాయిల వసూళ్లపై ప్రణాళిక రూపొందించాం. సీసీల నుంచి డీపీఎంల వరకు మహిళలతో సమావేశమవుతున్నారు. వాస్తవ పరిస్థితులు తెలుసుకుంటున్నారు. మహిళ సంఘాలను పొదుపు మార్గంలోకి తీసుకోస్తాం.

ఉమ్మడి జిల్లాలో రూ.29.46 కోట్లు

పొదుపు అర్హత బట్టీ ప్రతి సంఘానికి రూ.10 లక్షల వరకు రుణాలు బ్యాంకులు మంజూరు చేస్తున్నాయి. అయితే రుణాలు పొందిన కొందరు మహిళలు తిరిగి కిస్తీలు చెల్లించడం లేదు. వలస వెళ్లడం, మృతి చెందడం, నిర్ణీత 65 ఏళ్ల వయసు నిండటం తదితర కారణాలతో బకాయిలు పేరుకుపోతున్నాయి. మహిళల ఉపాధితో పాటు ఇతర అవసరాలకు తీసుకున్న రుణాల వడ్డీ, అసలు చెల్లించకపోవడంతో లావాదేవీలు నిలిచిపోతున్నాయి. గ్రామాఖ్య సంఘాల సహకారంతో అప్పులు చెల్లించని మహిళల్లో చైతన్యం కల్పిస్తున్నారు. కొన్ని చోట్ల వారు ముందు కొచ్చినప్పటికి మరికొన్ని చోట్ల ఆశించిన స్థాయిలో స్పందన లభించడం లేదు. ఒక సంఘంలో ఇద్దరు బకాయిదారులు ఉంటే వారి సొమ్ము తామెలా చెల్లిస్తామంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు. దీంతో సంఘాల మనుగడ కష్టంగా మారే ప్రమాదం ఉండటంతో అధికారులు సంఘంలోని సభ్యులందరినీ సమన్వయం చేస్తూ తిరిగి గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 49,544 స్వశక్తి సంఘాల్లో 5,48,091 మంది సభ్యులు ఉన్నారు. 1,031 సంఘాల్లో రూ.29.46 కోట్ల మొండి బకాయిలు ఉన్నాయి.

గుడి, బడిని సందర్శించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి



కోదండరామ ఆలయం వద్ద సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కుమార్ తదితరులు

కోనరావుపేట, న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం మల్కపేటలో మాజీ మంత్రి చల్మెడ ఆనందరావు తన సొంత డబ్బులు రూ.6 కోట్లు పైగా వెచ్చించి నిర్మించిన పాఠశాల భవనాన్ని సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కుమార్ సందర్శించారు. విద్యార్థులకు కార్పొరేట్ విద్య అందించేందుకు వీలుగా నిర్మించడం అభినందనీయమన్నారు. అనంతరం కాళేశ్వరం ఎత్తిపోతలు ప్యాకేజీ-9 రిజర్వాయర్ కట్టను ఆనుకుని బొల్లి గుట్టపై నిర్మించిన శ్రీకోదండరామస్వామి ఆలయాన్ని సందర్శించారు. పాఠశాల, ఆలయ నిర్మాణాలకు సంబంధించిన వివరాలను మాజీ మంత్రి కుమారుడు మధుసూదన్‌రావును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట న్యాయవాదులు రామారావు, శ్రీధర్‌రెడ్డి, గ్రామ నాయకుడు ఆరె మహేందర్ తదితరులు ఉన్నారు.

డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష ఫలితాల విడుదల

కరీంనగర్ కలెక్టరేట్ : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గత సెప్టెంబరులో నిర్వహించిన డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలు వెబ్‌సైట్ www.satavahana.ac.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

చదువుతున్నారా.. బడి మానేశారా?

పాఠశాలల్లో తేలని విద్యార్థుల లెక్క

జిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్య: పెద్దపల్లి 7,498; కరీంనగర్ 12,952; జగిత్యాల 5,285; రాజన్న సిరిసిల్ల : 4,400

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తేల్చలేక విద్యాశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ ఏడాది ప్రవేశాల గడువు ముగిసినప్పటికి తుది జాబితా కొలిక్కిరాలేదు. పిల్లలు చదువుతున్నారా? బడి మానేశారా? అనే ప్రశ్నలకు పొంతన కుదరడం లేదు.



పెద్దపల్లిలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

ఎందుకింత నిర్లక్ష్యం

■ కేంద్ర ప్రభుత్వం ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థుల సంఖ్య కోసం 2012-13లో యూడైస్ పోర్టల్ (ఏకీకృత జిల్లా విద్యా సమాచారం) తెచ్చింది. రెండేళ్ల కిందట దీన్ని యూడైస్ ప్లస్‌గా మార్చారు.

■ ఏటా విద్యార్థుల సమగ్ర వివరాలు పొందుపరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 30,135 మంది పిల్లల సమాచారం లేదు.

■ బడి ఈడు పిల్లలు చదువుతున్నారా? బడి బయట ఉన్నారనే విషయం తేల్చేందుకు యూడైస్ ప్లస్ నివేదిక తేల్చుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఈ నివేదిక కొలమానం కానుంది.

■ ప్రవేశం పొందిన విద్యార్థి ఆధార్ అనుసంధానిస్తున్నారు. దీంతో ఒక విద్యార్థి పేరు రెండు చోట్ల ఉండే అవకాశం లేదు. ■ వివరాలు నమోదు చేయడంలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. పోర్టల్‌లో నమోదు కాని విద్యార్థుల వివరాలపై ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ ఫలితం లేదు.

నెలల తరబడి హాజరు కాకున్నా..

బడుల్లో బోగస్ సంఖ్య తప్పించుకునేందుకు ఎత్తుగడ వేస్తున్నారు. కొందరికి ఆధార్ వేలిముద్రలు పడటంలేదని.. మరికొందరు ఉపాధి కోసం వలస వెళ్లి మళ్లీ ఇక్కడికే చదువుకుంటారని.. ఆధార్ నవీకరణలో సాంకేతిక సమస్యలు ఉన్నాయని.. ఇలా కుంటిసాకులు చెబుతున్నారు. కొన్ని చోట్ల నెలల తరబడి పిల్లలు హాజరు కాకున్నా వారి రిజిస్టర్‌లో నమోదవుతున్నాయి. పిల్లల సంఖ్య తగ్గితే అక్కడ నుంచి బదిలీ లేదా డిప్యుటేషన్‌పై పంపిస్తారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. విద్యాశాఖ అధికారులు దృష్టి సారిస్తే బోగస్ సంఖ్య తేలనుంది.

బోగస్ లెక్కలేనా?

పాఠశాలల్లో చేరిన ప్రతి విద్యార్థికి శాశ్వత విద్యా సంఖ్య (పర్మనెంట్ ఎడ్యుకేషనల్ నంబర్) కేటాయించి పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఒక పాఠశాల నుంచి మరో బడికి మారినా, టీసీ తీసుకుని వెళ్లినా యూడైస్‌లోని డ్రాప్ బాక్స్‌లో వేస్తారు. ఈ శాశ్వత సంఖ్య ఆధారంగా ప్రవేశం కల్పిస్తే ఎక్కడ చదువుతున్నారో తెలుస్తుంది. ఒక వేళ బోగస్ పిల్లల నమోదు చేసినా వేరే చోట చేరకపోయినా డ్రాప్‌బాక్స్‌లో సంఖ్య కనిపిస్తుంది. విద్యార్థుల వివరాలు లేనివారివే డ్రాప్‌బాక్స్‌లో ఉంటాయి. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో 30,135 మంది పిల్లల సమాచారం తేలాల్సి ఉంది. వాస్తవంగా వీరంతా చదువుతున్నారా లేదో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రత్యేక కార్యాచరణ

ప్రతి విద్యార్థిని పోర్టల్ నమోదు చేస్తున్నాం. జిల్లాలో డ్రాప్ బాక్స్‌లో ఉన్న వివరాలను తొలగించేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నాం. తమ పరిధిలోని సంఖ్యను తేల్చాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశిస్తున్నాం. నిర్లక్ష్యం చేసిన యాజమాన్యాలపై కఠినంగా వ్యవహరిస్తున్నాం.

\- మాధవి, జిల్లా విద్యాధికారి